వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఓటు విజయం

ప్రజాస్వామ్యంలో అన్ని పండుగల కన్నా ఓట్ల పండుగే అతిపెద్దది, ముఖ్యమైనది. భారతదేశం ఆ పండుగను విజయవంతంగా పూర్తిచేసుకున్నది. ఏడు విడతల సుదీర్ఘ పోలింగ్ ప్రక్రియ చెదురుమదురు ఘటనలు మినహా దిగ్విజయంగా జరిగింది. ఓ వైపు మతతత్వం, మరోవైపు కులతత్వం హోరాహోరీగా తలపడిన ఎన్నికలివి. ఎప్పుడూ అంతర్వాహినిలా ఉండే ఈ అంశాలు ఈసారి కొంత బాహాటంగానే బయటకు రావడం గమనార్హం. పాలక బీజేపీకి ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావాలని ఉబలాటం, కాంగ్రెస్‌కు ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనే ఆరాటం. వీటి మధ్యలో ప్రజల సమస్యలు గాలికి ఎగిరిపోయాయి. సామాన్య ఓటరును నిత్యం వేధించే అంశాలేవీ నామమాత్రంగానైనా ప్రస్తావనకు రాకపోవడం విచారించదగిన విషయమే. ఈ ఎన్నికలు ఏ రకంగా చూసినా దేశ భవితవ్యం దృష్ట్యా చాలా కీలకమైనవిగానే నిలిచిపోతాయి. ఎన్నికల సంఘం చెప్పినట్టుగా అనేక మైలురాళ్లు దాటిన ఎన్నికలివి. 64.2 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడం ఓ రికార్డు. వారిలో 31.2 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉండటం మరో రికార్డు. మండే ఎండల్లో, కొన్నిచోట్ల 50 పైచిలుకు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనప్పటికీ, ఈ స్థాయిలో పోలింగ్ జరగడం విశేషమే మరి. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమనే బిరుదు సార్థకం కావడంలో ఇది ఎంతైనా తోడ్పడుతుంది. గత ఎన్నికలతో పోలిస్తే అతితక్కువ చోట్ల రీ పోలింగ్ జరగడం మన పోలింగ్ వ్యవస్థ పరిణతికి మరో నిదర్శనం. 2019లో 540 చోట్ల రీ పోలింగ్ జరిగితే ఈసారి ఆ సంఖ్య 35 మాత్రమే. అందులోనూ 25 రీ పోలింగ్‌లు రెండు రాష్ర్టాలకే పరిమితమయ్యాయి. జమ్ముకశ్మీర్‌లో గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత స్థాయిలో పోలింగ్ జరగడం ఒక విశేషమైతే, హింసాకాండ తలెత్తకపోవడం శుభపరిణామం. ఎన్నికల సంఘం పారదర్శకతే ప్రశ్నార్థకమైన నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో ఇన్ని రికార్డులు నమోదు కావడం గొప్ప విషయమే.

ఇక ఎన్నికల ప్రచార సరళి గురించి చెప్పుకోవాల్సిన విషయాలు చాలానే ఉన్నాయి. ప్రధాని మోదీ ప్రచారం తీరుపై చాలా విమర్శలే వచ్చాయి. తన పదేండ్ల పాలనలో సాధించిన అంశాలపై కాకుండా విపక్షాలను విమర్శించడం మీదే ఆయన దృష్టిపెట్టారు. మోదీ ప్రసంగాలపై కాంగ్రెస్ ఇచ్చిన ఫిర్యాదుపై ఆలస్యంగానైనా ఈసీ స్పందించాల్సి వచ్చింది. ఎప్పటిలాగే ప్రాంతీయ పార్టీల సందడి కొనసాగినప్పటికీ జాతీయంగా రెండు ప్రధాన పక్షాలు మిత్రపక్షాల అండదండలతో భీకరంగానే తలపడ్డాయి. ఎన్నికల భేరీ మోగకముందే బీజేపీ నేతృత్వంలోని పాలక ఎన్డీయే కూటమి అత్యుత్సాహంతో దూకుడు ప్రదర్శించింది. కానీ, ఒక్కో విడత పోలింగ్ ముగిసిన కొద్దీ విజయం ఖాయమనే ధీమా తగ్గిపోయింది. అటు ఏ మాత్రం ఆశావహ పరిస్థితులు లేకుండా ఎన్నికల బరిలోకి దిగిన కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పరిస్థితి మెరుగుపడినట్టు చెప్పుకొంటున్నా కచ్చితంగా అధికారం సాధించే స్థితికి చేరుకున్నట్టు పూర్తి నమ్మకమైతే కలగలేదు. ఆవేశకావేశాల ఎన్నికల హంగామా ముగిసిన తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఓ ఆటవిడుపులా మారి బోలెడు వినోదాన్ని పంచాయి. చిత్రవిచిత్రమైన మలుపులతో టీ-20 మ్యాచ్ తరహాలో ఉత్కంఠభరితంగా సాగిన ఎన్నికల అసలు చిట్టా నేడు బయటకు వస్తుంది. విజేతలెవరో విస్పష్టంగా తెలుతుందా? లేక టై అవుతుందా? అనే సస్పెన్స్‌కు ఈ రోజుతో తెర పడనున్నది. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా ప్రజాస్వామ్యం తప్పకుండా గెలుస్తుంది.

ప్రజా సమస్యలు పట్టని ఎన్నికలు

పార్లమెంట్ ఎన్నికల ఎగ్జిట్ పోల్ ఫలితాలను చూస్తుంటే దేశంలో ఇప్పుడు మతమే సిద్ధాంతంగా మిగిలిపోయిందనిపిస్తున్నది. ఎగ్జిట్ ఫోల్ ఫలితాలు వస్తున్న సమయంలో జీ బిజినెస్ చానల్‌లో చర్చ జరుగుతున్నది. బీజేపీకి 320 సీట్లు వస్తాయని విశ్లేషకుడొకరు చెప్పారు. 'ఈ ఎన్నికల్లో అభివృద్ధి అంశాన్ని మోదీ అస్సలు ప్రస్తావించలేదని ఓ వైపు చెప్తూనే మరోవైపు 320 సీట్లు వస్తాయని ఎలా చెప్తున్నారు? మీ వాదన పరస్పర విరుద్ధంగా ఉంది' అని ప్రశ్నించగా.. అదేం కాదు, ఈ దేశంలో 95 శాతం వరకు ఎన్నికలు మతం, కులం ఆధారంగానే జరుగుతాయని ఆయన సమాధానం ఇచ్చారు.

బుద్ధా మురళి

బీజేపీ ఒక్కటే మత రాజకీయాలు చేస్తున్నదని చెప్పలేం. హిందుత్వ పేరిట బీజేపీ బహిరంగంగానే మత రాజకీయాలు చేస్తే.. హిందుత్వకు వ్యతిరేకంగా మైనారిటీ మత రాజకీయాలను కాంగ్రెస్ నమ్ముకున్నది. ఒకవైపు మైనారిటీ మతాలను, మరోవైపు కుల రాజకీయాలను కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్నది. అయితే బీజేపీ హిందుత్వ రాజకీయాల ముందు కాంగ్రెస్ మైనారిటీ మత, కుల రాజకీయాలు నిలువలేకపోయాయని ఎగ్జిట్ పోల్ ఫలితాలు చెప్తున్నాయి. అసలైన ఫలితాలు ఈ రోజు వస్తాయి. సీట్ల విషయంలో కొద్దిగా తేడా ఉండవచ్చు కానీ తుది ఫలితాలకు, ఎగ్జిట్ పోల్ ఫలితాలకు మధ్య పెద్దగా తేడా ఉండకపోవచ్చు! అన్ని సర్వేలు కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 350కు పైగా సీట్లు వస్తాయని.. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు 100 స్థానాలకు పైగా వస్తాయని సర్వేలు చెప్తున్నాయి. సర్వేలు తలకిందులై బీజేపీ సీట్లు కాంగ్రెస్‌కు, కాంగ్రెస్ సీట్లు బీజేపీకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇందిరాగాంధీ హయాంలో గరీబీ హటావో అనే నినాదం దేశాన్ని కదిలించింది. ఇప్పుడు అంత పేదరికం లేదు. 80 కోట్ల మంది పేదలకు మోదీ ప్రభుత్వం సబ్సిడీ బియ్యం ఇస్తున్నది. అంటే రికార్డుల ప్రకారం.. 80 కోట్ల మంది నిరుపేదలున్నట్టే. ఇందిరాగాంధీ హయాంలో కన్నా ఎక్కువ మంది పేదలున్నట్టే లెక్క. అయితే ఇది లెక్కల్లో మాత్రమే కనిపించే పేదరికం. నిజంగా అంత పేదరికం ఉంటే ఎన్నికల్లో మతం, కులం కన్నా గరీబీ హటావో నినాదం ఎక్కువ పనిచేసేది. దేశం ఆకలి స్థాయి దాటిపోయింది. ఇప్పుడు మతమే ప్రధాన ఆకలి.

హిందువులను, ముస్లిం మైనారిటీలను రాజకీయ పక్షాలు పంచుకున్నాయి. కులంపై తిరుగులేని ఆయుధం మతం అని 90వ దశకంలోనే బీజేపీ గ్రహించింది. వీపీ సింగ్ (జనతాదళ్) కులం ఆయుధంగా మండల్ కమిషన్‌ను తెరపైకి తీసుకువస్తే.. రథయాత్ర పేరిట అద్వానీ మత రాజకీయాలకు తెరలేపారు. బీజేపీ వ్యూహం ఫలించింది. గుజరాత్‌లో మత కలహాలు మోదీని జాతీయ నాయకునిగా మార్చాయి.

ఇస్లామిక్ టెర్రరిజం, దేశంలో అనేక చోట్ల ఉగ్రవాదుల దాడులు సైతం బీజేపీ ఎదుగుదలకు దోహదం చేశాయి. దాదాపు పాతికేండ్ల పాటు సంకీర్ణ రాజకీయాలను మన దేశం చూసింది. ఈ తరుణంలో మోదీ నాయకత్వంలో ఏక పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడమే ఆశ్చర్యమనుకుంటే.. వరుసగా మూడోసారి కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెప్తున్నాయంటే మత రాజకీయాలు ఎంత బలంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అటు హిందూ మత రాజకీయాలు, ఇటు ముస్లిం మైనారిటీ మత రాజకీయాల పేరిట రెండు జాతీయపార్టీలు ప్రజలను చీల్చుకోవడం ఇతర పార్టీలను ఇబ్బందికరమైన పరిస్థితుల్లోకి నెట్టేశాయి. ఒకప్పుడు దేశంలో రాజకీయ పార్టీలకు ఆర్థిక సిద్ధాంతాలే ప్రధానాంశాలుగా ఉండేవి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో కాంగ్రెస్ ఒక్కటే ఉన్నా.. కాంగ్రెస్‌లోనూ అంతర్గతంగా సిద్ధాంతపరంగా తీవ్రమైన చర్చ, ఘర్షణ ఉండేది. సోవియెట్ రష్యా విచ్ఛిన్నం, 1991లో ఆర్థిక సంస్కరణలతో దేశంలో అప్పటివరకు ఉన్న సిద్ధాంతాలకు కాలం చెల్లినట్టయింది.

మూడు దశాబ్దాల పాటు బెంగాల్‌ను పాలించిన వామపక్షాలకు ఆ రాష్ట్ర శాసనసభలో ఒక్క సీటు కూడా లేని పరిస్థితి. ఉత్తరప్రదేశ్‌లో దళిత, బ్రాహ్మణ ఐక్యతతో బీఎస్పీ అధికారంలోకి వచ్చినప్పుడు దేశవ్యాప్తంగా సోషల్ ఇంజినీరింగ్ అని విస్తృతంగా చర్చ జరిగింది. కానీ, ప్రస్తుతం యూపీలో బీఎస్పీకి ఒక్క సీటు కూడా దక్కని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు దేశంలో మతమే ఏకైక సిద్ధాంతం. ప్రత్యర్థులు సైతం మెచ్చుకొనే వాజపేయి 2004 ఎన్నికల్లో అభివృద్ధి నినాదంతో ఇండియా షైనింగ్ అని ఎన్నికలకు పోయి ఓడిపోయారు. అభివృద్ధి మాటెత్తకుండా మతాన్ని నమ్ముకొని మోదీ వరుసగా మూడోసారి గెలిచేందుకు బాటలు వేసుకున్నారు. సీట్ల సంఖ్య ఎలా ఉన్నా దేశంలో యువత ఆలోచనలపై వామపక్షాల ప్రభావం ఉండేది. ఒక ఎమ్మెల్యే సీటు, ఒక నామినేటెడ్ పోస్ట్ ఇస్తే చాలు నయింలను కూడా భుజాన మోయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్తున్న వామపక్షాలు కాలగర్భంలో కలిసిపోయాయి. మత రాజకీయాలకు విరుగుడు మత రాజకీయాలు కావు. దీనివల్ల మత రాజకీయాలు మరింతగా బలపడతాయి. దేశం పేదరికంలో ఉన్నప్పుడు పేదరిక నిర్మూలనే ప్రధానాంశంగా నిలుస్తుంది. ఇప్పుడు మన దేశం ఆకలికి అలమటించే పేద దేశం కాదు, అందుకే మతం ప్రాధాన్యం వహిస్తున్నది. కాలమే పరిస్థితులను మారుస్తుంది.

అంధేర్ నగరీ.. చౌపట్ రాజా!

మే 24 నాడు రాత్రి రెండు వాహనాల్లో వచ్చిన రేవంత్ సర్కార్ మఫ్టీ పోలీసులు పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక గ్రామంలో నివాసం ఉండే నా చెల్లెలి ఇంటిమీదికి పోయినప్పుడు ఆ గ్రామంలో కరెంటు లేదు! ఆ సమయంలో మా చెల్లెలు, ఆమె కొడుకు మాత్రమే ఇంట్లో ఉన్నారు. వాళ్లు అభ్యంతరపెడుతున్నా వినకుండా ఆ చిమ్మచీకట్లోనే ఇంట్లోకి దూరి, తమ మొబైల్ ఫోన్ టార్చిలైట్ల వెలుతురులో దిలీప్ కోసం అన్ని రూములూ పోలీసులు గాలించారని విన్నప్పుడు నాకు 1881లో ప్రముఖ హిందీ రచయిత భర్తేందు హరిశ్చంద్ర రాసిన నాటకంలోని 'అంధేర్ నగరీ-చౌపట్ రాజా' వాక్యం గుర్తొచ్చింది.

స్వర్ణ కిలారి

ఇవ్వాళ తెలంగాణలో ఆ దృశ్యం అనేకవిధాల కొనసాగుతున్న చీకటి రాజ్యాన్ని కండ్లకు కడుతున్నది. ఈ చీకటి రాజ్యాన్ని ఏలుతున్న చౌపట్ రాజా ఎంత అభద్రతాభావంతో బతుకుతున్నాడో గత ఐదు నెలల సోకాల్డ్ ప్రజా ప్రభుత్వ పాలన తీరు చెప్తున్నది. ఒక అక్రమ, అబద్ధపు, అన్యాయపు కేసులో నా సహచరుడిని ఇరికించిన సర్కార్, దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తప్పు మీద తప్పు చేస్తూ పోతున్నది.

సుమారు వారం రోజుల కిందట మొదలైంది ఈ దుర్మార్గపు ప్రహసనం. మే 23 నాడు పొద్దుపోయాక దిలీప్ మిత్రుడు వాట్సాప్‌లో మెసేజ్ చేశాడు. అది చదివేలోపే తనే ఫోన్ చేశాడు. 'నీ మీద కేసు పెట్టారు, తెలిసిందా?' అని. 'లేదు. ఏం కేసు?' అని అడిగాడు దిలీప్. 'డీటైల్స్ పంపాను చూడు' అని ఫోన్ పెట్టేశాడు ఆయన. మిత్రుడు పంపిన కేసు ఎఫ్ఐఆర్ కాపీ చదివి ఆశ్చర్యపోయాం. నిజానికి ప్రభుత్వం మారి రేవంత్ రెడ్డి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి దిలీప్‌ను ఏదో విధంగా వేధిస్తారని ఊహిస్తూనే వచ్చాను. కానీ, అబద్ధపు కేసొకటి పెట్టి ఊహించిన దానికన్నా దిగజారుడు రాజకీయం చేస్తున్నారు.

మే 22 నాడు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చిన విషయం తెలియజేస్తూ, దానికి ఒక కొత్త లోగో కూడా జత చేస్తూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వాట్సాప్ గ్రూపులో ఆయన సిబ్బంది రిలీజ్ చేశారు. ఆ లోగోను రాష్ట్రంలోని మీడియా సంస్థలు ప్రసారం చేశాయి. ఓ టీవీ చానల్ పెట్టిన ఆర్టీసీ పాత, కొత్త లోగోలతో కూడిన పోస్టర్‌ను మే 22 నాడు రాత్రి ఒక పోస్టు చేస్తూ కొత్త లోగోలో తెలంగాణ చిహ్నాలైన చార్మినార్, కాకతీయ తోరణం ఎందుకు తీసేశారని ప్రశ్నిస్తూ, తెలంగాణ అస్తిత్వంతో ఆటలాడితే తీవ్ర ప్రతిచర్య ఉంటుందని దిలీప్ ఎక్స్, ఫేస్‌బుక్‌లలో పోస్టు చేశాడు. మే 23 ఉదయం సుమారు పది గంటలకు ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు కొత్త లోగో ఇంకా ఫైనలైజ్ చెయ్యలేదని ఒక వివరణ పంపించారు. ఈ సంభాషణ జరిగినప్పుడు నేను తన పక్కనే ఉన్నాను. దిలీప్ వారికి థాంక్స్ చెప్పి, తన సామాజిక మాధ్యమాల్లోని పోస్టులను డిలీట్ చేశాడు.

సాయంత్రానికి రేవంత్ సర్కార్ దిలీప్ మీద, మరో మిత్రుడు హరీశ్‌రెడ్డి మీద ఈ లోగోను వీళ్లిద్దరే తయారు చేశారని హాస్యాస్పదమైన ఆరోపణ చేస్తూ ఒక తప్పుడు కేసు పెట్టింది. మే 22 నాడు ఉదయం నుంచి అన్ని మీడియా సంస్థల్లో వచ్చిన లోగోను దిలీప్ పోస్టు చేస్తే, ముందుగా ప్రచురించిన వారినెవరినీ ఏమీ అనకుండా మే 22 నాడు రాత్రి పోస్టు చేసిన దిలీప్ మీద కేసు పెట్టడం స్పష్టంగా కుట్రపూరితంగా జరిగింది. ఫిర్యాదు వచ్చిన కొద్దిసేపట్లోనే కనీస ఇన్వెస్టిగేషన్ లేకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చెయ్యడం, కేసు ఎఫ్ఐఆర్ ఎవరికీ చేరకముందే వింతగా ముఖ్యమంత్రి పౌర సంబంధాల అధికారి (సీఎం పీఆర్ఓ) పుత్రరత్నం ఎక్స్ అకౌంట్ నుంచి పోస్ట్ కావడంతో, ఇది రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా పెట్టించిన కక్షసాధింపు కేసు అని మాకు అర్థమైంది. గురువారం సాయంత్రం కేసు పెట్టి, శుక్రవారం సాయంత్రం ఊహించినట్టే ఆరుగురు మఫ్టీ పోలీసులు మా ఇంటిమీదికి వచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోలీసుల ఈ ఎత్తుగడ గురించి తరచూ వినేవాళ్లం. శుక్రవారం సాయంత్రం అరెస్టు చేస్తే శని, ఆదివారాలు కోర్టులు ఉండవు కనుక రెండు రోజులు సదరు వ్యక్తిని తమ కస్టడీలో ఉంచుకోవచ్చనే అతి తెలివి ఎత్తుగడను మళ్లీ చౌపట్ రాజా వారి పాలనలో మొదలుపెట్టారన్నమాట పోలీసులు.

పోలీసులు వచ్చిన సమయానికి దిలీప్ ఇంట్లో లేకపోవడంతో మేము ఉండే అపార్ట్‌మెంటు సెక్యూరిటీ వారిని బెదిరించి సీసీ టీవీ ఫుటేజీ ఎత్తుకుపోయారు. ఆ తర్వాత ఆ ఫుటేజీలో మా కారు డ్రైవర్‌ను గుర్తించి, తన ఇంటి మీదికి పోయి ఒక రోజంతా ఏ కారణం చూపకుండానే ఆయనను అక్రమ నిర్బంధంలో ఉంచారు. చివరికి లాయర్‌ను పంపితే కానీ పోలీసులు ఆయనను వదలలేదు. ఈ అక్రమ కేసు ఉద్దేశం దిలీప్‌ను అరెస్టు చేసి వేధించడమే అని మిత్రులు కొందరు చెప్పారు. అందువల్లనే లాయర్ సలహా తీసుకొని ముందస్తు బెయిల్ పిటిషన్ వేశాం. ఈ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేసిన తప్పుడు ఆరోపణలే మరోసారి వల్లెవేశారు. టీఎస్ఆర్టీసీ నకిలీ లోగోను దిలీపే తయారు చేశాడట! ఆయన్ని అర్జెంటుగా అరెస్టు చేయకపోతే సాక్ష్యాలను (ఏమిటో ఆ సాక్ష్యాలు?) తారుమారు చేస్తాడట.

పోలీసులు దిలీప్‌ను అరెస్ట్ చేయడానికి ఇంటిమీదికి రావడం, మా చెల్లెలి ఇంట్లో సోదాలు, పత్రికల్లో, సోషల్ మీడియాలోనూ చూసిన న్యూస్ వల్ల తనకొచ్చిన అవగాహన మేరకు, నా పద్నాలుగేండ్ల కొడుకు అడిగాడు 'అమ్మా! ఇంత క్లియర్‌గా తెలుస్తుంది కదా, నాన్నేమీ తప్పు చేయలేదని. మరి తప్పుడు కేసు పెట్టినవాళ్లు, మనింటికి వచ్చిన పోలీసులు కేసు క్లియరయ్యాక నాన్నకు సారీ చెప్తారా?' అని. పది రోజుల నుంచి మేమంతా కోల్పోయిన మానసిక ప్రశాంతతకు, నా కొడుకు ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్తారు? ఒక్కటి మాత్రం స్పష్టం. దిలీప్ ఏ తప్పూ చేయలేదు. కేవలం తనను వేధించాలన్న దుర్బుద్ధితో రేవంత్ సర్కార్ పెట్టిన ఈ అక్రమ కేసును కోర్టు ద్వారా పోరాడి న్యాయం పొందగలమనే విశ్వాసం మాకున్నది. అక్రమ కేసుల ద్వారా దిలీప్‌ను నిలువరించాలని ప్రయత్నించడం వృథా ప్రయాసేనని ఆయన సహచరిగా గట్టిగా చెప్పగలను.

నిన్న హైకోర్టులో దిలీప్ బెయిల్ పిటిషన్ వేశాం. త్వరలోనే ఈ కేసులో తనకు ఊరట లభిస్తుందన్న నమ్ముతున్నా. ఈ సమయంలో అండగా నిలిచిన మిత్రులకు, బీఆర్ఎస్ కుటుంబానికి, తెలంగాణ ఆత్మబంధువులందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్తున్నా... జై తెలంగాణ.

(వ్యాసకర్త: తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ సహచరి)



ఫేక్ ఎగ్జిట్ పోల్స్

పేదరికం, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, నిరుద్యోగం పట్ల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రైతులు, యువత, సామాన్యులు బీజేపీపై కోపంతో ఉన్నారు. వారంతా ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఎగ్జిట్ పోల్స్ వాస్తవ ఈవీఎం ఫలితాలను ప్రతిబింబించవు. అవి ఫేక్ ఎగ్జిట్ పోల్స్.



- బిశ్వరంజన్ మొహంతీ, ఒడిషా కాంగ్రెస్ నేత

ఉత్సవాల్లో ఉద్యమకారులేరి?

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సందర్భంగా జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో ఉత్సాహం కొరవడి, పైపై మొక్కుబడితనమే కన్పించింది. ఆశ నిరాశల మధ్య, ప్రాణత్యాగాలు, పోరాటాల ఫలితంగా సిద్ధించిన రాష్ట్రంలో పదేండ్ల స్వపరిపాలన సంబురాలు ఇంటింటి పండుగలా, ఉప్పొంగిన గుండెలతో తెలంగాణమంతా కళాకాంతులతో వెలిగిపోవాలి. వివిధ కార్యక్రమాలతో కనీసం వారం రోజులైనా రాష్ట్రవ్యాప్తంగా మార్మోగాల్సిన సందడి కేవలం రెండు పూటల ముచ్చటగా ముగిసిపోయింది.

బి.నర్సన్
94401 28169

సీఎం రేవంత్ రెడ్డి పొద్దున గన్‌పార్క్‌లోని అమరుల స్తూపం వద్ద నివాళులర్పించి, అటునుంచి పరేడ్ గ్రౌండ్స్ వెళ్లి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత తన ప్రసంగంలో ఆయన 'రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో మొదటి ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్నాం' అన్నారు. గత పదేండ్ల పాలన సాగించింది ప్రజా ప్రభుత్వం కాదని అర్థం ఆ మాటలో ఉంది. ఏ ప్రభుత్వమైనా ప్రజల ఓట్ల ద్వారానే ఏర్పడుతుంది. ప్రజాకంటకులనేది పాలనాక్రమంలో కాలం నిర్ణయిస్తుంది. తొలిదశ ఉద్యమకాలంలో కాంగ్రెస్ పాలనలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఆదేశాల ప్రకారం జరిగిన పోలీసు కాల్పుల్లో చనిపోయిన 369 తెలంగాణ బిడ్డల స్మృతిలో గన్‌పార్క్‌లో స్తూపం ఏర్పాటైంది. మలిదశ ఉద్యమానికి అడుగడుగునా అది స్ఫూర్తిగా నిలిచింది. రాష్ట్ర సాధన తర్వాత స్వీయ పాలనలో తెలంగాణ కోసం బలిదానాలు చేసిన అమరుల పేరిట సచివాలయం ఎదురుగా 2023లో భారీ స్మారకాన్ని ప్రభుత్వం నిర్మించింది. అయితే సీఎం కొత్తగా నిర్మించిన అమరుల స్మారక నిర్మాణం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. రాష్ట్ర ఆవిర్భావ సందర్భంగా దాన్ని ఆయన సందర్శించకపోవడం శోచనీయం. వ్యక్తిగత స్పర్థలను అమరుల త్యాగాలకు, స్మారక నిర్మాణాలకు అంటగట్టడం సరికాదు.

అమరుల త్యాగఫలమే తెలంగాణ అనేది శిలాక్షరం. అమరుల కుటుంబాలను పరేడ్ గ్రౌండ్స్‌కు పిలిపించి వారి కోసం ఒక ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేసి గౌరవించారు. సీఎం ప్రసంగంలోగాని, ఆ తర్వాతి ప్రభుత్వ కార్యక్రమాల్లో గాని అమరుల కుటుంబాల ప్రసక్తి కానరాలేదు. రేవంత్‌రెడ్డి లేదా ఆయన తరఫున ఎవరైనా అమరుల కుటుంబాల గ్యాలరీ వద్దకెళ్లి వారి బాగోగులు తెలుసుకొని, వారి పిల్లల త్యాగాలను కీర్తించవలసిన సందర్భమది. సాయంత్రం జరిగిన సంబురాల ప్రదర్శనలో హడావుడియే ఎక్కువగా కన్పించింది.

తెలంగాణ సంస్కృతి, కళల, జానపద, నృత్యాల ప్రదర్శనల కవాతు సాగింది. ఢిల్లీ, రాజ్‌పథ్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగే వివిధ కళా ప్రదర్శనల మాదిరే ఇది కొనసాగింది. ముఖ్యమంత్రి, గవర్నర్ ఏదో కొత్త వింతను చూస్తున్నట్టు కనిపించారు. ఆ తర్వాత వేదికపై తెలంగాణ జాతి గీత కర్త అందెశ్రీని, సంగీత కర్త కీరవాణిని ప్రభుత్వం సత్కరించింది. ఈ సంబురాల చప్పుదనం చూస్తుంటే 'తెలంగాణ కోసం ఏ ఉద్యమమూ జరగలేదు, భాషా ప్రయుక్త రాష్ర్టాల దారిలోనే తెలంగాణ ఏర్పడింది' అనేలా కార్యక్రమం సాగింది. ప్రత్యేక రాష్ట్ర సాధనలో పడ్డ గోస, యాతన, త్యాగాలేవీ ఈ ఉత్సవాల నిర్వాహకులకు తెలిసినట్టుగా లేదు. లేదా ఆ గొప్పతనాన్ని యాదిచేసి తమ రాజకీయ విపక్షానికి క్రెడిట్ ఇవ్వొద్దనే ఆలోచన అయి ఉండొచ్చు.

ప్రభుత్వ వివక్ష కారణంగా తెలంగాణ ఉద్యమంలో ఏండ్ల తరబడి పాల్గొన్నవారు, తమ సమయాన్ని, సొమ్మును త్యాగం చేసినవారు ఈ వేళ ఇంటికే పరిమితమై లేదా ప్రేక్షకులుగా మిగిలిపోవడం అసలైన విషాదం. రాజకీయపరంగా వైరుధ్యాలుండి, ఉన్న విషయాన్నీ కూడా ఒప్పుకొనేందుకు మనసు రాకపోవచ్చు కానీ, రాజకీయాలకు దూరంగా ఉంటూ తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన ఎందరో ఇప్పుడు ఈ ఉత్సవం తమది కానట్టుగా, పరాయివాళ్లు ఫలితాన్ని అనుభవిస్తున్నట్టుగా కనిపించారు. వేదికలపై తెలంగాణ ఏర్పాటును బలంగా చెప్పినవాళ్లు, టీవీ చర్చల్లో దీటుగా మాట్లాడినవాళ్లు, పత్రికల్లో వరుసగా మద్దతు వ్యాసాలు రాసినవాళ్లు, కవులు, కళాకారులు, వారి సంఘాలు, పాటగాళ్లు, ఆటగాళ్లు ఇలా ఎన్నోవిధాలా ఉద్యమానికి ఇంధనంగా పనిచేసినవాళ్లు దశాబ్ది ఉత్సవాల్లో అనామకులుగా మిగిలిపోవడం నిజంగా విచారకరం. ప్రజల్లో వారి గుర్తింపునకు కొదువ లేకున్నా తమ సాధ్య ఫలానికి దూరంగా ఉండటం మనసు నొచ్చుకునే విషయమే.

తెలంగాణ పోరులో సాంస్కృతిక కార్యక్రమాలకు రసమయి బాలకిషన్ పెట్టింది పేరు. ఆయన గజ్జెకట్టి ధూంధాం నిర్వహించని వేదిక లేదు. అంతడుపుల నాగరాజు నృత్యనాటికలు అలరించేవి. జయరాజ్ పాటలు టీవీల్లో మార్మోగేవి. దేశపతి శ్రీనివాస్ గొంతెత్తితే సభికులు మంత్రముగ్ధులయ్యేవారు. తెలంగాణ రచయితల వేదిక తరఫున జూలూరు గౌరీశంకర్, జూకంటి జగన్నాథం కవులను సమాయత్తం చేసేవారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి తెలంగాణ ఆకాంక్షను ప్రకటించే కవితలతో భారీ సంకలనాలు తెచ్చారు. సంగిశెట్టి శ్రీనివాస్ తన చారిత్రక పరిశోధనతో తెలంగాణ ఘనకీర్తిని వెలికితీశారు. బీఎస్ రాములు ఎడతెగకుండా తెలంగాణ చరిత్ర, సాహిత్యం, సంస్కృతులను ప్రతిబింబించే ఎన్నో పుస్తకాలను ప్రచురించారు. ఘంటా చక్రపాణి, దాసోజు శ్రవణ్, విఠల్, రఘు తదితరులు టీవీ డిబేట్లలో ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని, ఆంధ్ర పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ వాదించారు. టీఎన్జీఓల సారథిగా స్వామిగౌడ్ సమర్థ నాయకత్వాన్ని పోషించి సమ్మెలను విజయవంతంగా నడిపారు. కేశవరావు జాదవ్, బూర్గుల నర్సింగరావు లాంటి పెద్దలు తొలి, మలి ఉద్యమాలకు తోడుగా ఉన్నారు. కోదండరాం జేఏసీల కన్వీనర్‌గా రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించారు. ఆర్.విద్యాసాగర్ రావు తెలంగాణ నీటి వనరులపై స్పష్టతనిచ్చి 'నీళ్లు నిజాలు' బహిర్గత పరిచారు. జయశంకర్ సార్ తెలంగాణ జనానికి ప్రాతఃస్మరణీయులు.

తెలంగాణను కీర్తించే పాటను అందెశ్రీ రాస్తే నేల దుఃఖాన్ని పేర్కొనే పాటలెన్నో వచ్చాయి. గద్దర్ 'పొడుస్తున్న పొద్దు మీద..', నందిని సిధారెడ్డి 'నాగేటి చాళ్లల్ల నా తెలంగాణ', జయరాజ్ 'వానమ్మా..' తదితర పాటలు జనం గుండెల్లో తెలంగాణ కాంక్షను రగిలించాయి. మన పత్రిక మన గౌరవం పేరిట మొదలైన 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు ఎడిటర్‌గా అల్లం నారాయణ ఉద్యమానికి అక్షర దీప్తిని అందించారు. ఎన్ని పేర్లు ఎత్తుకున్నా ఒడువని ముచ్చట ఇది. వీరిలో చాలామంది పదవులను, ప్రతిఫలాన్ని ఆశించలేదు. తమ కళ్లతో తెలంగాణ సాకారాన్ని చూడగలిగామనే సంతృప్తి వారికి చాలు. ఇందరి త్యాగధనుల శ్రమఫలం స్వరాష్ట్రం. తెలంగాణ సాధంపై ఏదో ఓ రాయిపై వీరి పేరు ఉంటుంది. పాలకులెవరైనా వాటిని చెరిపేయలేరు.